ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.21.08.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాజకీయాల్లో నైతిక విలువల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాజ్యాంగ సంస్కరణలు కొనసాగిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.
2. ఆన్ లైన్ గేముల ప్రభావానికి యువత లోనుకాకుండా చూసే లక్ష్యంతో ప్రతిపాదించిన ఆన్ లైన్ గేమింగ్ ప్రమోషన్, నియంత్రణ బిల్లును లోక్ సభ ఆమోదించింది.
3. కాళేశ్వరం కమిషన్ నివేదికను సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్ పై హైకోర్టు విచారణ చేపట్టింది.
4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

------------------------

**కిషన్ రెడ్డి-డిల్లీ**

దేశ హితం కోసం ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపడుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని మరింత గౌరవించి, రాజకీయాల్లో నైతిక విలువల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాజ్యాంగ సంస్కరణలు ప్రతిపాదిస్తే ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని మంత్రి ఆక్షేపించారు. డిల్లీ లో ఈ ఉదయం ఆయన విలేకరులసమావేశంలో మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక 130 వ రాజ్యాంగ సవరణలు - తీవ్ర నేరారోపణలు ఎదుర్కొని జైలులో ఉన్నట్లయితే ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు,

ముఖ్యమంత్రులు, రాష్ట్రాల మంత్రులు ఎవరైనా పదవినుంచి వైదొలగాలని ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు.

దీన్ని ప్రతిపక్ష కాంగ్రెసు పార్టీ, ఆ పార్టీ నేతృత్వంలోని కూటమి అడ్డుకోవటం దురదృష్టకరం అన్నారు. ఈ రోజు రాజ్యసభలో ఆ తర్వాత JPCలో బిల్లుపై చర్చించనున్నట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా ప్రజలు, మేధావులు బిల్లును స్వాగతిస్తున్నారన్నారు. ప్రజలెన్నుకునే రాజకీయ నాయకులు చట్టాలు చేస్తారాణీ, అలాంటి వారికి నైతిక విలువలు అవసరమనీ మంత్రి అన్నారు. కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**(Soundbyte- కిషన్ రెడ్డి)**

ఉపరాష్ట్రపతి ఎన్నికపై స్పందిస్తూ, వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పోటీ చేసినపుడు కాంగ్రెసు పార్టీకి తెలుగు వారి గౌరవం గుర్తు రాలేదని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెద్ద ఎత్తున యూరియా స్టాక్ పెట్టినా, దాని వినియోగంపై స్పష్టత లేదన్నారు. యూరియాను పద్ధతి ప్రకారం వాడుకుని, దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

**MSL**

--------------------------

**గేమింగ్ బిల్లు**

ఈ-స్పోర్ట్స్, ఆన్ లైన్ సోషల్ గేమ్ లను ప్రోత్సహించే ఆన్ లైన్ గేమింగ్ ప్రమోషన్, నియంత్రణ బిల్లు 2025ను లోక్ సభ నిన్న ఆమోదించింది. ఈ బిల్లు హానికరమైన ఆన్ లైన్ మనీ గేమింగ్ సర్వీసులు, ప్రకటనలు, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను నిషేధిస్తుంది. ప్రతిపక్షాలు వివిధ అంశాలపై గందరగోళం సృష్టించడంతో చర్చ జరగకుండానే మూజువాణీ ఓటుతో ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది.

**డెస్క్**

------------------------------

**హై కోర్టు:**

కాళేశ్వరం కమిషన్ పై మాజీ ముఖ్యమంత్రి, BRS అధినేత  K చంద్రశేఖర రావు, మాజీ మంత్రి హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ను సవాల్ చేస్తూ వీరు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని బెంచ్ విచారణ చేపట్టింది. కక్షిదారుల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ సుందరం శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూండగా, PC ఘోష్ తరఫున న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు.

**MSL**

--------------------------------

**జలాశయాలు-జూరాల**

ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాలతో పాటూ, కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. జూరాల జలాశయానికి 3 లక్షల 8 వేల క్యూసెక్కుల వరద నీరు చీరుతుండగా, అధికారులు 44 గేట్లు ఎత్తి మూడు లక్షల 9 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.1 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 316.3 మీటర్లుగా నమోదైంది. కాగా, ప్రాజెక్టు 5 విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఇలా ఉండగా, హైదరాబాద్ జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లలో గణనీయంగా వరద నీరు చేరుతోంది. ఉస్మాన్ సాగర్‌కు 1400 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా 2 గేట్లు ఒక అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్‌కు 1200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా ఒక గేటు మూడు మీటర్ల మేర ఎత్తి నీటిని వదులుతున్నారు.

**Desk**

---------------------------

**వర్షాలు**

రాష్ట్రంలో వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రధాన నదులు, వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ అయ్యాయి. అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఈరోజు ఆదిలాబాద్, హైదరాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ సహా పలు జిల్లాలలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

డెస్క్

--------------------------

**భద్రాద్రి -గోదావరి:**

గోదావరి వరద ఉధృతి భద్రాచలం వద్ద పెరుగుతోంది. ప్రస్తుతం గోదావరి 51 అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు. మరిన్ని వివరాలు మా ప్రతినిధి హరికృష్ణ అందిస్తున్నారు.

**(Voice cast)**

భద్రాచలం వద్ద గోదావరి 51 అడుగులు దాటి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. మరో రెండు అడుగులు నీటిమట్టం పెరిగితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. గోదావరి నదీ ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రాష్ట్ర రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లాలో సహాయక చర్యలను పరిశీలిస్తున్నారు. ప్రజల సహాయం కోసం కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు బూర్గంపాడు దుమ్ముగూడెం లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే NDRF,DDRF బృందాలను అప్రమత్తం చేసి కలెక్టర్ ఎస్పీ పరిస్థితిలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

-----------------------------

**ములుగు- గోదావరి:**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి నది రెండో ప్రమాద హెచ్చరిక వద్ద ప్రవహిస్తోంది. ఈ ఉదయం 6 గంటల వరకు 16. 46 మీటర్లు ఉన్న గోదావరి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గి 16.43 మీటర్లకు చేరుకుంది. దాంతో వరద ప్రమాదం తప్పినట్లేనని అధికారులు భావిస్తున్నారు. మరిన్ని వివరాలు మా ప్రతినిధి ముండ్రాతి ప్రతాప్ అందిస్తున్నారు.

**(వాయిస్ కాస్ట్ )**

గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూండటంతో ఏటూరు నాగారం సమీపంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ కేంద్రాలకు తరలించారు. ముఖ్యంగా ఏటూరునాగారం, వెంకటాపురం, వాజీడు, కన్నాయిగూడెం మండలాలకు చెందిన రెండు వందలపైగా కుటుంబాలను జిల్లాలోని ఎనిమిది సహాయ కేంద్రాలకు తరలించారు. అక్కడ వారికి అధికారులు ఆహారం నీరు కనీస సౌకర్యాలు అందిస్తున్నారు. కాగా, ఈ ఉదయం గోయదావరి ఉధృతి తగ్గుతూ ఉండటంతో ముంపు ప్రమాదం తగ్గినట్టే అధికారులు భావిస్తున్నారు. అయితే, పరీవాహక ప్రాంతాలలో వర్షాలు కురుస్తూ ఉండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.

**పీటీసీ –ములుగు**

------------------------

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరుప్రాజెక్టుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. 17 వేల 152 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతుండగా అన్నపూర్ణ రిజర్వాయర్ కు 3 వేల 200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------

**పొన్నం టెలీ కాన్ఫరెన్స్**

విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బీసీ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో తాజా పరిస్థితులపై మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులకు విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో క్రిమీ కీటకాలు చేరకుండా గడ్డీ, చెత్తా చెదారం తొలగించాలని అన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రటరీ సైదులు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

**MSL**

-----------------------------

**EC- ప్రత్యేక సమ్మరీ రివిజన్:**

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజక వర్గం తుది ఓటరు జాబితాను వచ్చే నెల 30వ తేదీ వరకు వెలువరించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, GHMC కమిషనర్ RV కర్ణన్ తెలియజేశారు. ఉప ఎన్నికల కోసం జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ప్రత్యేక సమ్మరీ రివిజన్ ను వచ్చే నెల 2 నుంచి 17 వ తేదీ వరకు చేపట్టనున్నట్లు వెల్లడించారు. GHMC కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయం వివరించారు. నియోజక వర్గంలో ప్రత్యేక సమ్మరీ రివిజన్ లో భాగంగా ఈ ఏడాది జూలై ఒకటి నాటికి 18 ఏళ్ళు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 25 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

**MSL**

------------------------

**శ్రీధర్ బాబు**

లైఫ్ సైన్సెస్ రంగంలో రాష్ట్రం గ్లోబల్ లీడర్ గా అవతరించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోందని వెల్లడించారు. గడిచిన 20 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో రాష్ట్రానికి 54 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, దీని ద్వారా 2 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించగలిగామని మంత్రి తెలిపారు. ఈ పెట్టుబడులు ప్రపంచంలోని అతిపెద్ద ఏడు లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా హైదరాబాద్ నిలిచిందన్నారు.

**డెస్క్**

---------------------

**కుక్క కాటుకు చర్యలు....**

నల్గొండ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో కుక్కలకు నూటికి నూరు శాతం వ్యాక్సిన్ వేయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కుక్కల దాడులు, కుక్క కాట్ల పై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుక్క కాటు బాధితుల కోసం ప్రత్యేకంగా హెల్ప్ లైన్ నంబర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------